

హైదరాబాద్ టైమ్స్

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 277 గురువారం 12 నవంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

ఫిన్లాండ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ‘పిట్ హీట్ స్టోరేజ్’ నిర్మాణం

పాత కంకర క్వారీలో భారీ ఎత్తున వేడి నీటి నిల్వకు ఏర్పాట్లు

వేసవిలో లభించే వేడిని నిల్వ చేసి శీతాకాలంలో వినియోగించడం దీని లక్ష్యం

నగర వార్షిక ఉష్ణ అవసరాల్లో నాలుగో వంతు తీర్చనున్న ప్రాజెక్టు

2



ట్రంప్ ప్రతిపాదిత ‘విజయ తోరణం’ పై కెన్నెడీ కుటుంబం కేసు

కెన్నెడీ, వేలాది సైనికుల సమాధుల వీక్షణకు అడ్డంకి అని ఆరోపణ

ప్రాజెక్టును 14 రోజులు నిలిపివేస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిన కోర్టు

వీరులను గౌరవించేందుకే నిర్మాణం అంటున్న వైట్‌హౌస్

కాంగ్రెస్ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో ఆరోపణ

2



కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క



సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్న సీఎం

దేశంలో భారతీయ జనతా పార్టీని (బీజేపీ) సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా, బలం కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన ‘జాతీయ విద్యా దినోత్సవం’, ‘మైనార్టీ సంక్షేమ దినోత్సవం’ వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువు ప్రారంభానికి సిద్ధం



సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సాయంత్రం ప్రారంభోత్సవం

చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ప్లే ఏరియా ఏర్పాటు

గౌరవ అతిథిగా హాజరుకానున్న నటుడు అక్కినేని నాగార్జున

అభివృద్ధి పనుల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య

యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



రాష్ట్రంలో 86 రద్దీ బస్ స్టేషన్లలో ఉచిత వైఫై



ఒక్కో బస్ స్టేషన్‌కు ప్రత్యేక కంట్రోలర్ నియామకం

బస్సుల వివరాల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

కొత్త టైమ్ టేబుల్ బోర్డుల ఏర్పాటు

అన్ని బస్ స్టేషన్లలో త్వరలో సీసీ కెమెరాలు

భారీ డిస్కౌంట్లు ఇస్తామంటే నమ్మొద్దు: టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో



రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా నకిలీ ఆన్‌లైన్ ప్రకటనలు, క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్న సీఎం

స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన 'జాతీయ విద్యా దినోత్సవం', 'మైనార్టీ సంక్షేమ దినోత్సవం' వేదుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి బీఆర్ఎస్ మిత్రపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ గల్లీల నుంచి బయలుదేరే 'కారు' గుర్తు.. ఢిల్లీ చేరేసరికి బీజేపీ 'కమలం' పువ్వుగా మారిపోతోందని ఆయన చమత్కరించారు. కేంద్రంలో బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం కొనసాగిస్తోందని విమర్శించారు. మైనార్టీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని సీఎం మండిపడ్డారు. పేద మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రద్దు చేయాలని బీజేపీకి ఏ దేవుడు చెప్పాడని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. మైనార్టీ రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న బీజేపీ.. చేతనైతే ముందుగా ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఆ రిజర్వేషన్లను రద్దు చేసి చూపించాలని ఆయన సవాల్ విసిరారు. పేదలకు, మైనార్టీలకు ఓటు హక్కు కల్పించి రాజకీయంగా బలోపేతం చేసింది కాంగ్రెస్ పార్టీ అయితే, బీజేపీ మాత్రం వారి హక్కులను కాలరాయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతని స్తోందని సీఎం చెప్పారు. పాతబస్తీలోని సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులను ప్రభుత్వం శరవేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ద్వారా పాతబస్తీకి చారిత్రక పూర్వవైభవాన్ని తీసుకొస్తామని, మూసీ నదీ పరివాహక ప్రాంతంలో 'నైట్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దేశంలో పారిశ్రామిక శిక్షణ సంస్థలకు (ఐటీఐ) మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాది వేశారని సీఎం గుర్తుచేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) అప్‌గ్రేడ్ చేసిందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత విస్తరిస్తున్న వేళ, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఏఐ రీప్లేస్ చేయలేని 'బ్లూ కాలర్' ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. సరైన నైపుణ్యాలు ఉంటే బ్లూ కాలర్ జాబ్స్ రంగంలో అవకాశాలకు కొరత ఉండదన్నారు. యువతలో నైపుణ్యాలు, క్రీడలను ప్రోత్సహించేందుకే ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'లను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించాలని, విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని పిలుపునిచ్చారు. రాజకీయంగానూ మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. గతంలో గులాం నబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు అనేక మంది నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించామని, ప్రస్తుతం మాజీ క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడంతో పాటు షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించామని గుర్తుచేశారు. అంతే కాకుండా రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిన బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ వంటి మైనార్టీ క్రీడాకారులకు భారీ నగదు ప్రోత్సాహకాలతో పాటు గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను అందించి గౌరవించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి కొనియాడారు.

మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువు ప్రారంభానికి సిద్ధం

హైదరాబాద్ నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంలో భాగంగా మరో ముందడుగు పడింది. మాదాపూర్ హైటెక్ సిటీ ప్రాంతంలోని చారిత్రక తమ్మిడికుంట చెరువుకు కొత్త శోభ సంతరించుకుంది. పునరుద్ధరణ పనులు పూర్తి చేసుకున్న ఈ చెరువును తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేడు సాయంత్రం లాంఛనంగా ప్రారంభించను న్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. చెరువు అభివృద్ధికి ఆయన తనవంతు సహకారం అందించిన సంగతి తెలిసిందే. హైటెక్ సిటీలోని శిల్పారామం సమీపంలో ఉన్న ఈ చెరువు, ఒకప్పుడు ఆక్రమణలు, చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలతో పూర్తిగా కుంచించుకుపోయింది. దీని పునరుద్ధరణ బాధ్యతలను 'హైడ్రా' చేపట్టింది. చెరువులో పేరుకుపోయిన సుమారు 30,000 ట్రక్కుల పూడిక, వ్యర్థాలను తొలగించి లోతు పెంచారు. ఫలితంగా చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగింది. పునరుద్ధరణలో భాగంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు అనేక సౌకర్యాలు కల్పించారు. చెరువు చుట్టూ సుమారు 1.6 కిలోమీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, ఆహ్లాదకరమైన ల్యాండ్‌స్కేపింగ్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు వర్షాకాలంలో వరద ముంపు సమస్యకు కూడా పరిష్కారం లభించనుంది. హైదరాబాద్‌లో 'హైడ్రా' తొలి దశలో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పనుల్లో తమ్మిడికుంట ఒకటి అని అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఇదే వేదికపై తమ్మిడికుంట చెరువుతో పాటు రామాంతపూర్‌లోని పెద్ద చెరువు అభివృద్ధి పనుల వల్ల నిరాశ్రయులైన 34 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను సీఎం తన చేతుల మీదుగా అందజేయనున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రంలో 86 రద్దీ బస్ స్టేషన్లలో ఉచిత వైఫై

తెలంగాణలోని బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 5 వేల మందికిపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 బస్ స్టేషన్లను గుర్తించింది. వీటిలో దశలవారీగా ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది. గుర్తించిన బస్ స్టేషన్లలో ఇప్పటికే ఒక్కో కంట్రోలర్‌ను నియమించింది. ప్రయాణికులు బస్సుల వివరాలు, రాకపోకల సమయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసింది. కొత్త టైమ్ టేబుల్ బోర్డులను కూడా అందుబాటులోకి తీసుకురానుంది. ప్రయాణికుల భద్రతతో పాటు బస్ స్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వీటిని సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించనున్నారు. తద్వారా బస్ స్టేషన్లలో పరిస్థితులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. బస్ స్టేషన్లలో వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు సంస్థ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

భారీ డిస్కౌంట్లు ఇస్తామంటే నమ్మొద్దు: టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా నకిలీ ఆన్‌లైన్ ప్రకటనలు, క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. ప్రజలకు పబ్లిక్ అడ్వైజరీ జారీ చేసింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల పేరుతో.. వల పన్ని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఇందుకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లను వినియోగిస్తున్నట్లు గుర్తించామ న్నారు.ముందుగా బ్రాండెడ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, దుస్తులపై భారీ డిస్కౌంట్లం టూ ప్రకటనలు ఇచ్చి.. అనంతరం యూపీఐ, డిజిటల్ వాలెట్లు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా డబ్బులు వసూలు చేస్తారని.. ఆ తర్వాత నకిలీ ఆర్డర్ కన్ఫర్మేషన్ పంపి డెలివరీ ఆలస్యమంటూ.. నమ్మించే ప్రయత్నం చేస్తారని.. డబ్బులు తీసుకున్న తర్వాత బాధితుల ఫోన్ నంబర్లు బ్లాక్ చేయడంతో పాటు.. నకిలీ వెబ్‌సైట్లను కూడా మాయం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వస్తువులు అందకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయి స్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు సూచించారు. క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు.. మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మోసాలు జరిగే తీరును వివరించారు. సైబర్ నేరగాళ్లు.. ముందుగా బ్యాంక్ రివార్డులు, క్యాష్‌బ్యాక్, కార్డు లిమిట్ పెంపు పేరులో ఫిషింగ్ లింకులను పంపుతారని.. లేదంటే, రూ.5 లక్షల వరకు క్రెడిట్ లిమిట్ పెంచుతా మంటూ నకిలీ మెసేజ్‌లు పంపి.. వాటి ద్వారా హానికరమైన ఏపీకే ఫైల్స్‌ను పంపుతారని పోలీసులు తెలిపారు. ఆ లింకులపై క్లిక్ చేయగానే కార్డు వివరాలు తస్కరణకు గురవుతాయని.. ఇలా కార్డు నంబర్, CVV, PIN, OTP వివరాలను కేటుగాళ్లు సేకరిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. బాధితుల ఫోన్స్‌కు SMS అలర్ట్‌లు రాకుండా.. మొబైల్‌లో మాల్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నారని వెల్లడించారు. ఈ విధంగా బాధితుల అనుమతి లేకుండానే.. నిమిషాల్లో వారి అకౌంట్ల నుంచి నేరగాళ్లు డబ్బులను కాజేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ లావాదేవీలను కూడా చేస్తున్నట్లు గుర్తించామన్నారు.

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

ట్రంప్ ప్రతిపాదిత 'విజయ తోరణం' పై కెన్నెడీ కుటుంబం కేసు

అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్మించ తలపెట్టిన 'విజయ తోరణం' వివాదానికి దారితీసింది. ఈ నిర్మాణం మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ సమాధి వీక్షణకు అడ్డుగా ఉంటుందని ఆరోపిస్తూ, ఆయన కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని కోరుతూ వారు దావా వేశారు. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వర్జీనియాలోని ఆర్లింగ్టన్ జాతీయ స్మశానవాటికకు ముఖద్వారం వద్ద 250 అడుగుల (76 మీటర్లు) ఎత్తుతో ఈ ఆర్చ్‌ను నిర్మించాలని ట్రంప్ ప్రభుత్వం ప్లాన్ చేసింది. అయితే, ఈ నిర్మాణం వల్ల జాన్ ఎఫ్ కెన్నెడీ సమాధితో పాటు అక్కడ ఖననం చేసిన వేలాది మంది సైనిక వీరుల సమాధులను చూసేందుకు శాశ్వతంగా అడ్డంకి ఏర్పడుతుందని కెన్నెడీ కుటుంబంలోని తొమ్మిది మంది సభ్యులు తమ పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం ఈ ప్రాజెక్టుకు నేషనల్ క్యాపిటల్ ప్లానింగ్ కమిషన్ ఆమోదం తెలిపినప్పటికీ, అమెరికా జిల్లా జడ్జి తాన్యా చుట్కన్ 14 రోజుల పాటు నిర్మాణ పనులపై తాత్కాలిక స్టే విధించారు. కెన్నెడీ కుటుంబ సభ్యులు తమ ఫిర్యాదులో, ఈ నిర్మాణం వల్ల చారిత్రక ప్రాధాన్యమున్న వీక్షణ రేఖలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఆర్లింగ్టన్ శ్మశానవాటికను సందర్శించే అనుభూతిని ఈ ఆర్చ్ పూర్తిగా మార్చివేస్తుందని, సమాధులకు ఇది 'శాశ్వత అవమానం' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబర్ట్, ఎథెల్ కెన్నెడీల ఏడుగురు పిల్లలతో పాటు వారి మనవడు, మాజీ కాంగ్రెస్ సభ్యుడు జో కెన్నెడీ, టెడ్ కెన్నెడీ కుమారుడు ఎడ్వర్డ్ కెన్నెడీ జూనియర్ ఈ దావా వేసిన వారిలో ఉన్నారు. అయితే, ట్రంప్ క్యాబినెట్‌లో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ ఇందులో భాగస్వామి కాలేదు. ఈ వివాదం పై వైట్‌హౌస్ స్పందించింది. "ఆర్లింగ్టన్ శ్మశానవాటికలో విశ్రాంతి తీసుకుంటున్న మన వీరులను గౌరవించేందుకు ఉద్దేశించిన నిర్మాణానికి వ్యతిరేకంగా కెన్నెడీ కుటుంబ సభ్యులు దావా వేయడం దురదృష్టకరం" అని వైట్‌హౌస్ ప్రతినిధి డేవిస్ ఆర్ ఇంగిల్ 'బీబీసీ'కి ఇచ్చిన ఒక ప్రకటనలో తెలిపారు. దేశాన్ని ఏకం చేసే ఈ కట్టడాన్ని రాజకీయం చేసేందుకు న్యాయవ్యవస్థను దుర్వినియోగం చేయకూడదని ఆయన హితవు పలికారు. ఈ కేసులో తమకే విజయం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అమెరికా 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ట్రంప్ ఈ ఆర్చ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు.

ఫిన్లాండ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద 'పిట్ హీట్ స్టోరేజ్' నిర్మాణం

పర్యావరణ హిత ఇంధన వనరుల వినియోగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్న ఫిన్లాండ్, మరో వినూత్న, అతి భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. హరివింకా నగరంలో గతంలో కంకర కోసం తవ్విన ఓ భారీ గుంతను ప్రపంచంలోనే అతిపెద్ద 'పిట్ థర్మల్ ఎనర్జీ స్టోరేజ్' కేంద్రంగా మార్చుతోంది. స్థానిక యుటిలిటీ సంస్థ 'హైవింక్యాన్ లాంపోవోయిమా ఓయ్' నేతృత్వంలో కులోమాకి ప్రాంతంలో ఈ నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారు 20 మీటర్ల (66 అడుగుల) లోతైన గుంతను దాదాపు 3,80,000 క్యూబిక్ మీటర్ల (100 మిలియన్ గ్యాలన్ల) నీటితో నింపుతున్నారు. ఈ ప్రక్రియ 2026 అక్టోబర్ ప్రారంభంలో మొదలైంది. 2027 ఏప్రిల్ చివరి నాటికి గుంతను పూర్తిగా నీటితో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత దాదాపు ఐదు ఫుట్‌బాల్ మైదానాలంత (225X165 మీటర్లు) విశాలమైన శాశ్వత కప్పును దీనిపై ఏర్పాటు చేస్తారు. 2027 వేసవి చివరి నుంచి వేడిని నిల్వ చేసే (హీట్ ఛార్జింగ్) ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ వ్యవస్థలో నీటిని 40°C నుంచి 90°C మధ్య ఉష్ణోగ్రతలో వేడి చేసి నిల్వ చేస్తారు. వేసవి కాలంలో తక్కువ ధరకు లభించే విద్యుత్‌తో నడిచే బాయిలర్లు, పారిశ్రామిక వ్యర్థాల నుంచి వెలువడే వేడిని సేకరించి ఈ జలాశయంలో నిల్వ చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఇలా నిల్వ చేసిన వేడిని శీతాకాలంలో, ఉష్ణానికి డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు నగరంలోని జిల్లా హీటింగ్ నెట్‌వర్క్‌కు సరఫరా చేస్తారు. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే, ఈ కేంద్రం సుమారు 18,000 మెగావాట్-గంటల ఉష్ణ శక్తిని నిల్వ చేయగలదు.

సంపాదకీయం

ఫ్రాన్స్ ప్రజల్లాగా నిరసన చేయలేమనా..?



భారతీయులు గొప్ప ప్రజాస్వామికవాదులు. శాంతి, సహనం, క్షమాగుణం వంటి విశిష్ట మానవీయ లక్షణాలు వారి డీఎన్ఏలోనే ఉన్నాయి. కనుకనే తరతరాలుగా పేద, మధ్యతరగతి వర్గాలు ఈతిబాధలతో సహజీవనం చేస్తూ, పేదరికం కారణంగా పట్టిపీడిస్తున్న సకల రుగ్మతలను మౌనంగా భరిస్తున్నారు. రెండు పూటలా కడుపు నింపుకోవటానికి అవసరమయ్యే నిత్యావసరాల ధరలు అందుబాటులో లేకున్నా, నాణ్యమైన విద్య, వైద్యం ఆమడ దూరంలో ఉన్నా, తలదాచుకోవటానికి కాసింత గూడు లేకున్నా లోలోపల కుమిలిపోతారే తప్ప ఫ్రాన్స్‌లో లాగానో, ఇతర దేశాల్లో లాగానో వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేయరు. తమ దుస్థితికి కారణమైన ప్రభుత్వాల మీద కలిగే ఆగ్రహాన్ని ప్రదర్శించడానికి ఐదేళ్లపాటు నిరీక్షిస్తుంటారు. తమ ఓటుతో ప్రభుత్వాలను మార్చగలమని, కొత్తగా వచ్చే ప్రభుత్వాలు తమ సమస్యలను తీరుస్తాయని భ్రమపడుతుంటారు.అంతర్గత అల్లర్లతో ప్రస్తుతం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న ఫ్రాన్స్ దేశ జనాభా రమారమి ఆరున్నర కోట్లు. అందులో దాదాపు ఎనిమిది లక్షల మంది ప్రజలు అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రస్తుతం నిరసనలు వ్యక్తం చేస్తూ పెద్దఎత్తున ఆందోళనలకు దిగి, అక్కడి ఇమాన్యుయేల్ మాక్రన్ ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు. వివిధ నగరాల్లో నిరసనను హింసాత్మక రూపంలో వ్యక్తం చేస్తున్నారు. కళలకు, సౌందర్యానికి పర్యాయపదమైన పారిస్‌లో ఎటుచూసినా విధ్వంసమే. ఈ నిరసనలకు మొదటగా అక్కడి ప్రజలను ప్రేరేపించింది పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి. ఫ్రాన్స్ పాఠశాలల్లో సగటున 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాల్సి ఉండగా 40 నుంచి 50 మంది పిల్లలకు ఒక టీచర్ మాత్రమే ఉన్నారు. ఈ అంశంపై పెల్లుబికిన నిరసనలు క్రమంగా ఇతర రూపాలను సంతరించుకున్నాయి.మరోపక్క మన దేశంలో ఎన్నడూ పాఠశాల ముఖం చూడని బాలల సంఖ్య 4.5 కోట్ల పైమాటేనని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్) సంస్థ వెల్లడించింది. ఒక్కో తరగతిలో ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని మన జాతీయ విద్యా విధానం నిర్దేశించగా, కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక టీచర్ మాత్రమే ఉన్నారు. అంతేకాదు, దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు లక్ష వరకూ ఉన్నాయి. అంటే ఒకటి నుంచి ఐదు తరగతులలో ఉన్న విద్యార్థులందరికీ ఒక్క టీచరు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని పేద మధ్యతరగతి కుటుంబాలవారు అప్పోసప్పో చేసి పిల్లలకు నాణ్యమైన చదువు కోసం ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు తప్ప, ఎన్నడూ ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలు పెంచాలని, టీచర్లను పెంచాలని వీధుల్లోకి వచ్చి నిరసన దీక్షలు చేపట్టిన దాఖలాలు కనపడవు.దేశంలో బియ్యం, గోధుమలు, పప్పులు నూనెలు వంటి నిత్యావసరాల ధరలు ప్రతి ఏటా సగటున 5శాతం నుంచి 7శాతం మేర పెరుగుతున్నాయని, ఇది సాధారణ ఆహార ద్రవ్యోల్బణమేనని ప్రభుత్వాలు చెబుతాయి. కానీ ఆహారంలో ముఖ్య భాగమైన కూరగాయలు, పండ్లు, మాంసం మొదలైన వాటి ధరల పెరుగుదలను ద్రవ్యోల్బణం లెక్కలోకి తీసుకోవడం లేదు. ముఖ్యంగా కాఫీ పొడి, టీ పౌడర్ల ధరలు ఏటా 15 నుంచి 20శాతం వరకూ పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. పంచదార, బెల్లం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. వంటనూనెలు, పప్పుల ధరలు అయితే ఏకంగా ఏటా 20శాతం చొప్పున పెరుగుతున్నాయి. ఇంటి అద్దెల భారాన్ని ద్రవ్యోల్బణంలో లెక్కించకపోవడం వల్ల వార్షిక ద్రవ్యోల్బణం 5శాతం కూడా దాటడంలేదని ప్రభుత్వాలు తప్పుడు లెక్కలతో ప్రజల్ని మభ్యపెడుతున్నాయి.పేద, మధ్యతరగతి వర్గాలను ఎక్కువగా బాధిస్తున్న సమస్య ఇంటి అద్దెల భారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎనిమిది దశాబ్దాలుగా పేదల కోసం అనేక గృహ నిర్మాణ పథకాలను ప్రవేశపెట్టి ఇళ్లు నిర్మిస్తున్నాయి. అయినప్పటికీ సొంతిల్లు లేని కుటుంబాలు నేటికీ దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నాయి. ప్రకృతిలో పక్షులు, మృగాలు సైతం సూర్యాస్తమయం కాగానే గూట్లోకి చేరిపోతాయి. అటువంటి అవకాశం లేనిది ఒక్క మనిషికే. తలదాచుకోవడానికి సరైన గూడు లేని ప్రజలున్న కారణంగానే దేశంలోని అన్ని పట్టణాలు, నగరాలకు దూరంగా మురికివాడలు ఏర్పడుతున్నాయి. ఐటీ, ఫార్మా తదితర రంగాలు విపరీతంగా అభివృద్ధి చెందడంతో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మహానగరాల్లో ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ఉద్యోగాలు చేస్తున్నవారు తమ సంపాదనలో 40 నుంచి 60శాతం వరకు ఇంటి అద్దె కోసం చెల్లించాల్సి వస్తోంది. అద్దె నియంత్రణ చట్టం (రెంట్ కంట్రోల్ యాక్ట్) ఉన్నప్పటికీ అది కేవలం కాగితాలకే పరిమితం. పైగా కొన్ని పట్టణాలు, నగరాలలో అడ్వాన్స్‌గా రెండు నెలల నుంచి ఆరు నెలల ఇంటి అద్దెను ఒకేసారి చెల్లించాలి. దీనికి తోడు ఇళ్ల బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చుకోవాలి. ఎప్పుడు పడితే అప్పుడు ఇళ్ల యజమానులు అద్దె పెంచేసినా చేసేది ఏమీ ఉండదు. పట్టణాలకు వలస వస్తున్న కూలీలు, డ్రైవర్లు, చిన్న చిన్న పనులు చేసే వారి సంపాదన తక్కువ. చాలీచాలని ఆదాయంతో అత్యధిక మొత్తం ఇంటి అద్దెకు పోగా మిగిలిన కొద్దిపాటి సొమ్ముతో వారు పౌష్టిక ఆహారం తీసుకోలేకపోతున్నారు. తమ పిల్లలను చదివించుకోలేకపోతున్నారు.

గోపాల గోపాల హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 11



కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పాపారాయుడు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గోపాల గోపాల హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. హోటల్ నిర్వాహకులు డి. భాస్కర రెడ్డి, భాస్కరరావు, విజయ్ ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. హోటల్ నిర్వాహకులు భాస్కర రెడ్డి, భాస్కరరావు, విజయ్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కి నిర్వాహకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ. వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొం టూ, నూతనంగా హోటల్‌ను ప్రారంభించిన నిర్వాహ కులకు శు భాకాంక్షలు తెలియజేశారు. హోటల్ నిర్వహ ణలో నాణ్యమైన ఆహారాన్ని, మంచి రుచిని, పరిశుభ్రమైన వాతావరణాన్ని వినియోగదారులకు అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ హోటల్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ నిర్వాహకులకు మంచి పేరు, ఆర్థిక అభివృద్ధి తీసుకురావాలని, భవిష్యత్తులో మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పాపారాయుడు నగర్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలి

– జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎం.ఏ. నయీమ్

కోరుట్ల తెహెల్కా న్యూస్:



భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న మహనీయుడు, స్వతంత్ర భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం జాతీయ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎం.ఏ. నయీమ్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు నౌనిహాల్ ఉర్దూ మీడియం హైస్కూల్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా డిసీసీ మైనారిటీ చైర్మన్ ఎం.ఏ. నయీమ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం, ఆయన ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యను సమాజ అభ్యున్నతికి ప్రధాన సాధనంగా భావించిన ఆయన, స్వాతంత్ర్యానంతరం దేశంలో ఆధునిక విద్యావ్యవస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన సేవలను, ఆలోచనా విధానాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మౌలానా ఆజాద్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, గొప్ప విద్యావేత్తగా, దార్శనిక నాయకుడిగా దేశానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, పేదరికం, సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించడానికి విద్య ఎంతో కీలకమని ఆయన విశ్వసించారని అన్నారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పరిశోధన, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి అవసరమైన సంస్థల నిర్మాణంలో ఆయన చూపిన దూరదృష్టి దేశ ప్రగతికి బలమైన పునాదిగా నిలిచిందని వివరించారు. కులం, మతం, ప్రాంతం, భాష వంటి భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆలోచనా విధానం నేటి సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పేద, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొం దించడం, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ విద్యా అవకాశాలు, పథకాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్ర మాలకు కాంగ్రెస్ మైనారిటీ విభాగం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారతదేశం భిన్న మతాలు, భాషలు, సంస్కృతుల సమ్మేళనమని, భిన్నత్వంలో ఏకత్వమే దేశ గొప్పతనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సహనం, సోదరభావంతో జీవించాలన్నదే మౌలానా ఆజాద్ ఆశయమని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటం, ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, యువతలో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడం నేటి సమాజంలో అత్యంత అవసరమన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చూపిన మార్గంలో యువత ముందుకు సాగినప్పుడే సమానత్వం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను మాటలకే పరిమితం చేయ కుండా ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ వసంత గంగాధర్ హాజరయ్యారు. అలాగే 21వ వార్డు కౌన్సిలర్ షహనాజ్ రిజ్వానా, 2వ వార్డు కౌన్సిలర్ హుమెరా వాసిద్, 17వ వార్డు కౌన్సిలర్ సోగ్రా బీ, 18వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ రహీం, 4వ వార్డు కౌన్సిలర్ తెడ్డు శిరీష విజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముజీబుర్ రహమాన్, మైనారిటీ నాయకులు రిహన్, ఫెరోజ్, యువకులు సాజిద్, సూఫియాన్, అజాన్ రజా, ముస్తాఖీమ్, అశ్రార్, ఆకిఫ్ లు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో, వేసవి తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ జలవనరులపై జలమండలి దృష్టి

-గండిపేటలో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఉన్నతాధికారుల బృందం

హైదరాబాద్ తెహెల్కా న్యూస్:



ఎల్‌నినో ప్రభావం, రాబోయే వేసవిలో తాగునీటి డిమాండ్ దృష్ట్యా హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జల మండలి ముందస్తు చర్యలు ముమ్మరం చేస్తోంది. సింగూరు-మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ జలవనరులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి బుధవారం ఉన్నతాధికారుల బృందంతో గండిపేట, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల్లో పర్యటించారు.జంట జలాశయాల నుంచి నగరానికి అదనపు తాగునీటి సరఫరా అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిబ్రవరి, మార్చిలో పెరిగే తాగునీటి అవసరాల దృష్ట్యా ఎంత నీటిని సేకరించవచ్చు, ఏ మార్గాల్లో తరలించవచ్చు, ప్రస్తుత పైప్‌లైన్ వ్యవస్థతో ఎలా అనుసంధానం చేయవచ్చనే అంశాలపై చర్చించారు. అదనపు నీటి తరలింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రత్యామ్నాయ పైప్‌లైన్ మార్గాలు, విస్తరణ అవకాశాలను పరిశీలించారు. ప్రతి జలవనరును సమర్థంగా వినియోగించుకుని సింగూరు-మంజీరాపై ఒత్తిడి తగ్గించాలని ఎండీ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మహేష్ కుమార్, సీఈఓ రాంబాబుతో పాటు ప్రాజెక్టు, ట్రాన్స్‌మిషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎరుకల తెగపై సిపి చేసిన వ్యాఖ్యలు బాధాకరం:ఏకలవ్య నగర్ అసోసియేషన్

ఎల్.బి.నగర్, నవంబర్ 11, తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

ఎరుకల తెగ కు చెందిన కులస్తులపై ఇటీవల ప్రెస్ మీట్ లో మల్కాజ్గిరి సిపి చేసిన వ్యాఖ్యలు బాధా కరంగా ఉన్నాయని ఏకలవ్య నగర్ కాలనీ అసోసి యేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జి.ఎస్.ఐ డివిజన్ పరిధిలోని ఏకలవ్య నగర్ కాలనీ కమిటీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ ఇటీవల మల్కాజ్గిరి కమిష నరేట్ పరిధిలో అధిక వడ్డీలకు పాల్పడుతున్న మహిళ లను పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. తధానంతరం ఏకలవ్య నగర్ కాలనీ, ఎరుకలను నాంచారమ్మ బస్తిలలో పోలీసులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడ్డ వస్తువులు, ద్విచక్ర వాహనాలు,ఏ ఒక్కటి కూడా తమ కాలనికి చెందినవి కావని,తాము ఎరుకల కులానికి చెందిన వారే అయినా మా వృత్తి తట్టలు, బుట్టలు అల్లడం,చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం లాంటి జీవనం కొనసాగిస్తామని, ఇలా ఎక్కడి నుంచో వచ్చి ఏకలవ్య నగర్ కాలనీ పేరు వాడుకుని మమ్ములను సమాజంలో తలెత్తుకోకుండా చేస్తున్నారని, ఇలాంటివారు మరల తప్పులు చేయ కుండా పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి తమ వంతు సహకారం కూడా ఉంటుందని వారు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కాలనీ వైస్ ప్రెసిడెంట్ కోనేటి మల్లేష్, పెద్ద శేను, ట్రెజరరి స్వామి,ఆర్గనైజింగ్ సెక్రటరీ కొన్ రెడ్డి లింగస్వామి, కోనేటి కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ కూతాడి నవీన్, కొన్ రెడ్డి రాములు, కోనేటి ధనుం జయ, కోనేటి అశోక్,దేవరాయ శివ, రుద్రాక్ష నాగా ర్జున, నిమ్మల సుదర్శన్,కోనేటి బక్కయ్య, కావడి నరసి ంహ, కుతాడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

18 ఎకరాల భూమి సమస్యపై దళిత రైతులకు న్యాయం చేయాలి -- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్.బి.నగర్, నవంబర్ 11, తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



హయత్‌నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 255/1లో ఉన్న 18 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి బాధిత దళిత రైతులకు న్యా యం చేయాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ని కోరారు.సుమారు 70 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి భూము లను ఇట్టి ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో లాక్కుందని తెలిపారు.రైతులు తమ భూమికి సంబం ధించిన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ భూమికి సంబంధించిన వివాదం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,భూమి హక్కులకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,అర్హులైన బాధిత రైతు లకు న్యాయం జరిగేలా సంబంధిత రెవెన్యూ అధికా రులు చర్యలు తీసుకోవాలని కోరారు.2022 లో భారస ప్రభుత్వం బాధిత రైతులకు ఎకరానికి 500 గజాల స్థలం కేటాయించే విధంగా నిర్ణయం తీసుకోని సంతకాలు సేకరించిది అని తెలిపారు. ప్రస్తుతం ఇట్టి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను టార్గెట్ చేసి 300 గజాల స్థలం ఇచ్చేలా చెప్పడం సరైంది కాదని అన్నారు.భూములు కోల్పోతున్న బాధిత రైతు లకు నష్టపరిహారంగా ఒక్కొక్కరికి 600 గజాల స్థలం ఇవ్వాలని సుధీర్ రెడ్డి కోరారు.అలాగే సాహెబ్ నగర్ శ్రీ.వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ సర్వే నెంబర్ 71/1నందు గత భారస ప్రభుత్వ హయాంలో 58,59 జీ.ఓ.క్రింద దరఖాస్తు చేయడం జరిగింది అని దానిలో కొందరు 59 జీ.ఓ.క్రింద దాదాపు 23 మంది ఒక్కొక్కరు ఒక లక్ష యాభై అయిదు వేల రూపాయలు(1,55,000) డబ్బులు కూడా కట్టడం జరిగింది అని తెలిపారు.అలాగే రెవిన్యూ అధికారులు పరిశీలించండం జరిగింది అని తెలిపారు. వారి లిస్ట్ కూడా రావడం జరిగింది అని తెలిపారు అక్కడ పేద,మధ్య తరగతి ప్రజలు దాదాపు 80 గజాల స్థలంలో ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు అని అన్నారు.కానీ ఇట్టి ప్రభుత్వం వారికీ పట్టాలు ఇవ్వకుండా ఆపివేయడం జరిగింది అని అన్నారు. కావున తక్షణం వీటి మీద చర్యలు తీసుకొని పట్టాలు ఇప్పించాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో రైతులు కటేపాక స్కైలాబ్,గంగాని నాగేష్,దుబ్బాక నవీన్, జయ ఈశ్వర్,బోడ శ్రీరాములు,కటేపాక ప్రవీణ్, గంగాని శ్రీను,బోడ శ్రవణ్,గంగాని ప్రవీణ్ మరియు శ్రీ వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ మాజీ అధ్యక్షులు కృష్ణ,బొమ్మడ శీను,రామాచారి,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతరత్న స్వతంత్ర సమరయోధులు మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026



పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో స్వతంత్ర సమర యోధులు మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి భారత రత్న మౌలానా అబుల్ కలాంఆజాద్ జయంతి సంద ర్భం గా స్థానిక ఏరియా హాస్పిటల్ వద్ద ఘనంగా నివాళులు అర్పిం చి బెడ్లు మరియు పండ్ల పంపిణీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మ న్ ఎండి అవైస్ చిష్టి మాట్లాడు తూ... మొట్టమొదటి స్వతంత్ర సమరయోధులు మౌలానా అబ్దు ల్ కలాం ఆజాద్ దేశం కోసం స్వ తంత్ర ఉద్యమంలోపోరాడి జైలు కు వెళ్లిన సందర్భాలు ఉన్నాయ ని ఆయన దేశానికి చేసిన సేవ లు ఎంతోగర్వకారణం అని అలా గే ఆయన మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రిగా దేశానికి ఎన్నో సేవలు అందించడం జరిగిందని 1947 నుండి1958 వరకు పండి ట్ జవహర్లాల్ నెహ్రూ మంత్రివ ర్గంలో విద్యాశాఖ మంత్రిగా కొన సాగారని అలాగే మహాత్మా గాంధీ తో కలిసి హిందూ ముస్లిం ల ఐక్యత కోసం కృషి చేశారని 1923లో కేవలం 35 ఏళ్ల వయ సులోనే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై రికార్డు సృ ష్టించారు.బాలికల విద్య పేదల కు గ్రామీణ ప్రజలకు బాలికలకు నాణ్య మైన విద్య అందాలని ఆకాంక్షించారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరం నడవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూర వెంకటేష్ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహ ంగీర్ డిసిసి ప్రధాన కార్యద ర్శి ఎం డి మజాహార్ నాయకులు ఎండి షరీఫ్ మున్సిపల్ కౌన్సిల ర్లు ఎండి బురహాన్ సుమయ్య తబస్సుశీ షఫీక్ అహ్మద్ ఎండి లైక్ అహ్మద్ షేక్ తాహెరా బబ్లు బొంత నర్సింగ్ ఎన. సుజాయత్ అలీ కౌసర్ షాది ఖానా చైర్మన్ ఎండి ఎజాజ్ ఎండి అఖిల్ ఎండీ జలీల్ ఎండి సమీర్ ఎండిమసూ ద్ ఎండి ఇంతియాజ్ ఎండి హఫీ స్ ఎండి అఫ్రోజ్ అండి హమీద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి -- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ : నవంబర్ 11 : తెహెల్కా న్యూస్

హెచ్.ఎం.టీ సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యో గులు హైదరాబాద్‌లోని హెచ్ఎంటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి హెచ్ఎంటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రిటైర్డ్ ఉద్యోగు లకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక బిజెపి నాయకుడు మల్కాజ్గిరి పార్ల మెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి, పార్లమెంట్‌లో ప్రస్తావించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా హెచ్ఎంటీకి చెందిన భూములు అన్యాక్రాం తమవు తూ, కబ్జాలకు గురవుతున్నాయని, సంస్థ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత హెచ్ఎంటీ యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో హెచ్ఎంటీ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ సభ్యులు జీవి నారాయణ రెడ్డి, రాములు,మధు కృష్ణ, రవీందర్ , యాదగిరి, కుమార స్వామి, మహేందర్, మాల్యాద్రి మరియు ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరవనిది

-ఎం ఏ వకీల్ జాతీయ మానవ హక్కుల కమిటీ, జిల్లా అధ్యక్షులు

తెహెల్కా న్యూస్



జాతీయ మానవ హక్కుల కమిటీ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన సంద ర్భంగా ఎంఏ వకీల్ జాతీయ మానవ హక్కుల కమిటీ నిర్మల్ అధ్యక్షులు మాట్లాడుతూ ఇతను దేశానికి చేసిన సేవలను కొని ఆడుతూ, మౌలానా అబుల్ కలాం నవంబర్ 11 ఫిబ్రవరి 1958 సంవత్సరంలో సౌదీ అరేబియాలోని మక్కాలో మక్కాలో జన్మిం చినారు. ఇతని అసలు పేరు మహివుద్దీన్ అహ్మద్ "అబుల్ కలాం" అంటే "సంభాషణలకు ప్రభువు"అని అర్థం. "ఆజాద్" అంటే స్వేచ్ఛ గలవాడు స్వాత ంత్రుడు అని అర్థం. ఇతను గాంధీజీ ప్రారంభించిన సహాయక నిరాకరణ ఉద్యమంలో పాల్గొని 1920లో కాంగ్రెస్ లో చేరారు. 1923 ఢిల్లీ ప్రత్యేక కాంగ్రెస్ సదస్సు మరియు 1940 నుండి 1946 మధ్యకా లంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. దేశ విభజనను తిరంగా వ్యతిరేకించారు ఇతను 1940 నుండి 1958 వరకు మొదటి విద్యా శాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవలందించారు దేశంలో ఐఐటీలు, యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ ఏర్పాటు కు కీలక పాత్ర పోషించారు నేడు జన్మదిన శుభ సందర్భంగా ఈరోజు భారతదేశంలో నవంబర్ 11న జాతీయ విద్యార్థి దినోత్సవం గా జరుపుకొ నుచున్నాము ఇతని మరణాంతరం 1992లో భారత దేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న తో సత్కరించారు 11 ఫిబ్రవరి 1958 నా విడిచారు ఇతను భారత దేశ హిందూ ముస్లిం ఐక్యత కోసం పోరాడిన మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు ఇట్టి కార్యక్ర మంలో ఇస్మాయిల్ ఖాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, షేక్ మజర్ నిర్మల్ పట్టణ అధ్యక్షులు, పిల్లి శ్రీనివాస్, గట్ల రాజేశ్వర్, నరసయ్య పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

-సర్పంచ్ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కా రాఘు వేందర్ రెడ్డి.



తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026

భువనగిరి నియోజకవర్గ పరిధి లోని అన్ని గ్రామాలల్లో ప్రభుత్వ పథకాలు(ఇందిరమ్మ ఇండ్లు) అర్హులైన లబ్ధిదారులకు గ్రామస భల ద్వార చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు ని రసన కార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమంలో వలిగోండ మం డల సర్పంచ్ల పోరం అధ్యక్షులు పనుమటి మమత నరేందర్ రెడ్డి,తోక్కాపురం సర్పంచ్ జన గాం పాండు,నమత్పల్లి సర్పంచ్ అతికం అరుణ లక్ష్మీనా రాయణ గౌడ్, తాజ్పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్,బోల్లెపల్లి సర్పంచ్ గోద అరుణ శ్రీనివాస్ గౌడ్, బండసోమారం సర్పంచ్ కటికే జంగయ్య,నందనం సర్పం చ్ నాగేల్లి గిరిజరమేష్ గౌడ్, సూ ర్యపల్లి సర్పంచ్ సత్యనారాయ ణ గౌడ్,నెమలికాల్వ సర్పంచ్ బి.సునీత, చందుపట్ల సర్పంచ్ కంకల కిష్టయ్య, కేసారం సర్పంచ్ కమ్మగాని మంజుల నర్సింహగౌడ్ లింగారాషి పల్లి సర్పంచ్ బోడిగే లింగా స్వామి, సంగ్యం సర్పంచ్ తరిమి లలిత,వెంకటాపురం స ర్పంచ్ బత్తుల కళమ్మ, జాలుకా లువ మద్దెల మంజులసందీప్, నాతాళ్ల గూడెం లింగాస్వామి, వర్కుట్ పల్లి జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మాయిపల్లిలో ధాన్యం కొను గోలు కేంద్రం ప్రారంభం

-పూజలు చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తంగపల్లి శ్రీవాణి రవి కుమార్.

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026



పట్టణంలోని బొమ్మాయిపల్లిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వ ర్యంలో వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్ ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని బుధవారం ఘనం గా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ తంగపల్లి శ్రీవాణి రవి కుమార్ ముందుగా ధాన్యం రాశికి పూజ లు నిర్వహించి,కొబ్బరికాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని లాంఛ నంగా ప్రారంభించారు. ఈ సందర్భం గామున్సిపల్ చైర్మ న్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవి కు మార్ మాట్లా డుతూ... రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూస్తామన్నారు. గ్రేడ్ - ఎ రకానికి క్వింటాల్ కు రూ. 2461, సాధారణ రకానికి క్వింటాల్ కు రూ. 2440 మద్దతు ధర చెల్లిస్తారని తెలిపారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని, కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం అమ్ముకుంటే 7 రోజుల్లో డబ్బు లు నేరుగా వారి బ్యాంక్ ఖాతా ల్లో జమఅవుతాయని చెప్పారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి,శుభ్రం చేసి తీసుకువస్తే తూకంలో ,తేమ శాతంలో ఎలాంటి ఇబ్బంది ఉం డదని,రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కేంద్రంలో క ల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల స్థానిక కౌన్సి లర్ గంజి శ్రీవాణి,మాజీ కౌన్సిల ర్ జిట్టా వేణు,కాంగ్రెస్ నాయకు లు రైతు వ్యవసాయ అధికారు లు కొనుగోలు కేంద్రం నిర్వాహ కులు,మహిళా సంఘాల సభ్యు లు,స్థానిక నాయకులు,అధికా రులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెజ్జాలక్ష్మయ్య ఫౌండేషన్ వయో వృద్ధులఆశ్రమాన్ని సందర్శించిన న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వి.మాధవి లత

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026



జిల్లా న్యాయసేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి కార్యదర్శి వి. మాధవి లత చీమల కొండూరులోని బెజ్జా లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్ర మాన్ని సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృ ద్ధుల యొక్క బాగోగులను,ఆశ్ర మ నిర్వాహకులు కలిపిస్తున్న వ సతులపై అడిగి తెలుస్తున్నారు. వయోవృద్ధులు ఒంటరి వారు కారని వారి సంరక్షణకై చట్టం అన్ని హక్కులను కల్పించిందని వాటిని సాధించుకోవటానికి అవ కాశాలు సద్వినియోగం చేసుకు నేటట్లుగా న్యాయ సేవా సంస్థ న్యాయ సేవలను అందజేస్తుం దని తెలిపి ఆశ్రమ ంలో ఉంటున్న కొంతమంది వయోవృద్ధులకు పెన్షన్ ఇతర ప్రభుత్వ లబ్ధి రావ ట్లేదని తెలుసుకొని దానికై తగు న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్, వయోవృద్ధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యా భాండాగారాలు.. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ : నవంబర్ 11 : తెహెల్కా న్యూస్

పుస్తక పఠనం ద్వారా ప్రతీ ఒక్కరూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లైబ్రరీ ప్రారంభోత్సవంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని 132 జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల గ్రంథాలయాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూదస్కూల్ విద్యార్థులు మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృధా చేసుకోకుండా పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశా లలో గ్రంథాలయాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విద్యాభ్యాసంలో ఆసక్తి ఉండి పేదరికంతో విద్యకు దూరమవుతున్న విద్యార్థులను ప్రోత్సహించి వారు విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా వారి తల్లిదం డ్రులకు విద్య అవసరాన్ని తెలియజేసేలా పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. కుత్బు ల్లాపూర్



నియోజక వర్గంలోని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేలా మన నియోజక వర్గంలోనే తన సొంత నిధులతో ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాలలను నిర్మించడం జరిగిందని నిరుపేద విద్యార్థులు ఈ కళాశాలలను వినియోగి ంచుకొని ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరా లను చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ వసుంధర, పాఠశాల ప్రిన్సిపాల్ కమల్ సింగ్, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు, పాఠ శాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

ఆలేరు బాలికల మైనారిటీ గురు కుల పాఠశాల,జూనియర్ కళా శాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్ట ర్ అనురాగ్ జయంతి

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026

ఆలేరులోని తెలంగాణ మైనారి టీ గురుకుల పాం ఠశాల, జూనియ ర్ కళాశాల (బాలికలు)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆక స్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఈ రోజు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాఠశాలలో చిత్ర పఠానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.జిల్లా కలెక్టర్ పాఠశాలలోని వంట గది,భోజనశాల,మరుగుదొడ్లు, విద్యార్థినుల వసతి గదులను పరిశీలించి,విద్యార్థినులకు అంది స్తున్న భోజనం,వసతిసౌకర్యాలు పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినుల తో మాట్లాడి విద్యా బోధన,పాఠ శాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.పదవ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి. వార్షిక పరీక్షల ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవా లని సూచించారు. ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవాల న్నారు. సబ్జెక్టుల్లో ఏమైనా సందే హాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రోత్సహించారు అనంతరం ఉన్నత విద్యతో పాటు ఐటీఐ,పాలిటెక్నిక్ తదిత ర సాంకేతిక



విద్యా కోర్సులు,వి విధ పోటీ పరీక్షలు,ఉద్యోగ అవ కాశాలపై అవగాహన పెంచుకో వాలని కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు నాణ్య మైన విద్యతో పాటు మె రుగైన వసతి,భోజన సౌక ర్యాలు కల్పించాలని సంబంధిత అధికా రులకు సూచి ంచారు.అనంతరం ఆలేరు మండలం లోని బహద్దూర్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఉన్న చిన్న పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారం మంచిగా అం దిస్తున్నారా,గుడ్డు పెడుతున్నా రా అని అడిగి తెలుసుకున్నారు. అలాగేచదువు పై పిల్లలను చిన్న చిన్న ప్రశ్నలను అడిగి తెలుసుకు న్నారు.మెనూ ప్రకా రం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జయమ్మ,జిల్లా విద్యా శాఖ అధి కారి బిక్షపతి,ఎమ్మార్వో ఆంజనే యులు, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ఈ నెల 14న శ్రీనివాస వైభవోత్సవం

-ఏడు కొండల స్వామివారికి ఏడు విశేష సేవలు..
భక్తులందరికీ ఆహ్వానం

అంబర్‌పేట: నవంబర్ 11తెహెల్కా న్యూస్:

శ్రీనిధి రియల్ ఎస్టేట్ అధినేత కొండూరి సురేష్ గుప్తా ఆధ్వర్యంలో, ఆచార్య ఆత్రేయ పర్యవేక్షణలో ఈ నెల 14వ తేదీ శనివారం అంబర్‌పేటలోని సురేష్ గుప్తా నివాస ప్రాంగణంలో శ్రీ శ్రీనివాస వైభవోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఏడు కొండల స్వామివారికి ఏడు విశేష సేవలను సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆచార్య ఆత్రేయ మాట్లాడుతూ. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీవారి సుప్రభాత సేవ, తోమాల సేవ, శ్రీవారి సన్నిధిలో విశేష పూజలు, తిరుమంజనం (అభిషేకం), కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, తిరువీధి ఉత్సవం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఈ వైభవోత్సవంలో స్వామివారిని వివిధ పుష్పాలు, పూజా అలంకరణలతో విశేషంగా అలంకరించి వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవం, దీపాలంకరణ, తిరువీధి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించనున్నాయి.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలనే



సంకల్పంతో ఈ వైభవోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి సేవల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం సుజాత సురేష్ గుప్తా మాట్లాడుతూ. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలనే పవిత్ర సంకల్పంతో శ్రీనిధి రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో, ఆచార్య ఆత్రేయ పర్యవేక్షణలో నవంబర్ 14వ తేదీన శ్రీ శ్రీనివాస వైభవోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారికి నిర్వహించే విశేష సేవలను భక్తులకు స్థానికంగానే దర్శించుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ ఉత్సవంలో సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు స్వామివారికి ఏడు విశేష సేవలను నిర్వహించనున్నాం. ఉదయం 5 గంటలకు ప్రారం భమయ్యే ఈ కార్యక్రమం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నిర్వహించే ఈ మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయడానికి భక్తులు, స్థానిక ప్రజలు, ఆధ్యాత్మిక వేత్తలు, పెద్దలు అందరూ సహకరి ంచాలని విజ్ఞప్తి చేసారు.15 తారీకు సాయంత్రం సహస్ర దీపోత్సవ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సంప్రదించాల్సిన నెంబర్. సురేష్ గుప్తా.No..9989739893

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ

-అంబర్‌పేటలో ఆధ్యాత్మిక శోభ.. అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన రామకృష్ణ నగర్ ప్రాంగణం

హైదరాబాద్; నవంబర్ 11తెహెల్కా న్యూస్;

బాగ్ అంబర్పేట్ రామకృష్ణ నగర్‌లో శ్రీధర్ రెడ్డి, సుజాత ఆధ్వర్యంలో, శ్రీనాథ్ రెడ్డి, శేఖర్ గురు స్వాముల పర్యవేక్షణలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్ర మాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించి భక్తులు భక్తిపార వశ్యంలో మునిగిపోయారు.నాగారం పవన భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయ్యప్ప నామస్మరణ, భక్తి పాటలతో పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతా



వరణం నెల కొంది. భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టు కున్నాయి.


బంగారం ధరలు


manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,41,980	10gms
22 kt	₹	1,30,150	10gms
SILVER	₹	1,91,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ మాతృవియోగం

-కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యూనాల దామోదర్ రెడ్డి.

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026



భువనగిరి మండలం వడాయి గూడెం గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బీసీ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్లెం కృష్ణ మాతృమూర్తి కళ్లెం హనుమక్క అనారోగ్యం తో మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆమె అంతిమ యాత్ర బుధవారం మధ్యాహ్నం స్వగ్రామమైన వడాయిగూడెంలో నిర్వహిం చారు. మృత దేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎ మ్మెల్సీ నెల్లికంటి సత్యం,సిపిఐ జిల్లాకార్యదర్శి యా నాల దామో దర్ రెడ్డి,జిల్లా సహాయ కార్యద ర్శి బోలగాని సత్యనా రాయణ, జిల్లా కార్యపర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, బండి జంగమ్మ, బచ్చనగొని గాలయ్య, కురిమిద్ద శ్రీనివాస్,చిగుర్ల లింగం పల్లె శేఖర్ రెడ్డి,కుసుమని హరీ చంద్ర,పేరబోయిన మహేందర్ యాదగిరిగుట్ట మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాసు గౌడ్, మాజీ ఎంపీటీసీలు తంగళ్ళపల్లి సుగుణాకర్, సీస కృష్ణ గౌడ్, సిపి ఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్,పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్,బీఆర్ఎస్ యాద గిరిగుట్ట పట్టణ అధ్యక్షులు పాప ట్ల నరహరి,సీనియర్ నాయకు లు మిట్ట వెంకటయ్య,సిపిఐ నాయకులు చిగుళ్ల లింగం,చెక్క వెంకటేష్, పేరబో యిన పెంటయ్య శాంతి కుమార్ తదితరులు నివా ళులర్పించారు.

2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం తో నిర్మించిన గోదామును ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026

ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో 2500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన గోదామును రాష్ట్ర ప్ర భుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సంద ర్భంగా రైతులను ఉద్దేశిం చి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మా ట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభు త్వంలో రైతుల సంక్షేమం ,వ్యవ సాయ రంగ అభివృద్ధికి



ప్రభు త్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంద ని తెలిపారు.రైతులకు అండగా నిలుస్తూ వ్యవసా యాన్ని లాభ సాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్ర మాలను అమలు చేస్తోందని వివరించారు. 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం తో నిర్మించిన ఈ గోదాము రైతు లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,పండించిన ధాన్యా న్ని సురక్షితంగా నిల్వ చేసుకోవ డానికి,పంటను వర్షాలు,ఇతర ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపా డుకోవడానికి దోహదపడుతుంద ని పేర్కొన్నారు.రైతులకు అవసరమైన సమయంలో ఈగోదాము ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,రైతు లకు మెరుగైన మౌలిక సదుపా యాలు కల్పిస్తూ వ్యవసాయ రం గాన్ని మరింత బలోపేతం చేసేం దుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

బాలానగర్ ఏసీపీ నరేశ్ రెడ్డి ని కలిసిన తెలంగాణా బీసీ వికాస సమితి సభ్యులు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 11



దీపావళి సందర్భంగా మర్యాద పూర్వకంగా బాలానగర్ ఏసీపీ నరేశ్ రెడ్డి ని కలిసిన తెలంగాణా బీసీ వికాస సమితి అధ్యక్షులు కాంటెస్టెడ్ ఎమ్మెల్యే భాశెట్టి నర్సింగరావు, మరియు బీసీ వికాస్ సమితి సైబరాబాద్ కార్పొరేషన్ అధ్యక్షులు చిలక ప్రకాష్ ముదిరాజ్, మానవ సేవే మాధవ సేవా కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ సెక్రటరీ గోకర్ల లక్ష్మి నారాయణ, బీసీ వికాస్ సమితి వైస్ ప్రెసిడెంట్ రవీందర్ గౌడ్, మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు రాలు కందుకూరు హారతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్య నారాయణ, బీసీ నాయకులు ఎంపీ, స్వామి తదితరులు ఉన్నారు ఈసందర్భంగా ఏసీపీ ని షాల్వాతో సత్కారుంచి బొకే ను ఇచ్చి స్వీట్ డబ్బాను ఇచ్చి సత్కారమ్ చేయడం జరిగింది.

శభాష్ శ్రీనివాస్ నాయుడు 13 సంవత్సరాలుగా అన్నదానం, గొప్ప పుణ్యకార్యం

-హుజూర్నగర్ రోడ్డులో అయ్యప్ప స్వాములకు అన్నదానం లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



కోదాడ ,నవంబర్ 11(బ్యూరో చీఫ్ వై వి)

నియమ నిష్ఠలతో దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములు, ఇతర భక్తులకు గత 13 సంవత్సరాలుగా నిరంతరాయంగా అన్నదానం చేయడం ఎంతో గొప్ప పుణ్యకార్యమని, కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి కొనియాడారు. బుధవారం కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్డులో ఉన్న గాలి రమేష్ నాయుడు బ్రదర్స్ స్థలంలో ఏర్పాటు చేసిన 13వ సంవత్సరం అన్నదాన కార్యక్రమశీ లో ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు గాలి శ్రీనివాస్ నాయుడుతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ స్వార్థం లేని సేవ భావంతో స్వాములకు ఆకలి తీర్చడం దైవ సేవతో సమానమన్నారు.సమాజంలో దైవచింతన, భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు స్వాములకు ఆకలి తీర్చే అన్నదాన సేవలు ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం (బాబు) ఉన్నారు ప్రతి రోజు కు 1000 మంది స్వాములు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. నేటి నుండి 60 రోజుల పాటు నిరంతరాయంగా జరిగే ఈ అన్నదానాన్ని మాలలు ధరించిన స్వాములందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు గాలి శ్రీనివాస్ నాయుడు, సీతారాం సింగ్, గంగిరెడ్డి రాకేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గురుస్వాములు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పడి పూజ !

నడిగూడెం, నవంబర్11 (తెహెల్కా న్యూస్)



నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో పొలంపల్లి అశోక్ స్వామి నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి వారి పడి పూజ మహోత్సవంలో కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బొల్లం మల్లయ్య యాదవ్ ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి దీక్ష అనేది కేవలం ఆధ్యాత్మిక సాధన మాత్రమే కాకుండా క్రమశిక్షణ, భక్తి, సహనం, సమానత్వం, సేవాభావం వంటి గొప్ప విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనిస్తూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, సమాజంలో ఐకమత్యం, సోదరభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా పడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులకు, అయ్యప్ప స్వామి భక్తులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

కూకట్‌పల్లి సదర్ సమ్మేళనంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 11

కూకట్‌పల్లి యాదవ సం ఘం గండి వారి కుటు ంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మే ళన కార్యక్రమంలో వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబాల్లో సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సదర్ సమ్మేళనం యాద వ సోదరుల ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయా లకు, ఆచార వ్యవహా రాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో యాదవ సోదరులు తరతరాలుగా తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ సదర్ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించడం అభినందనీయమని వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మానికి ఆహ్వానించి ఆత్మీయంగా స్వాగతించిన కూకట్‌పల్లి యాదవ సంఘం సభ్యులకు, గండి వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవా దాలు తెలియజేశారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా లో పేరు నమోదు కాని అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి, ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి

-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

తెహెల్కా న్యూస్ భువనగిరి 11-11-2026



మినీ మీటింగ్ హాల్లో జిల్లా కలెక్ట ర్ అనురాగ్ జయంతి,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,వివి ధ పొలిటికల్ పార్టీ నాయకులతో SIR, మీజ పై సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ మాట్లడు తూ..ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగం గా ముసాయిదా ఓటరు జాబితా లో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పిం చిన ప్రక్రి యపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధు లతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 21వరకు ఎన్యుమరేష న్ ఫారాలు సమర్పించేందుకు గడువు పొడగించడం జరిగింద ని తెలిపారు.బూత్ స్థాయి అధి కారులు ఇంటింటికీ వెళ్లి ఎ ఎస్ డి డి జాబితాలో ఉన్న ఓటర్లను సంప్రదించి,వారికి అనుబంధ ఫా రాలను అవసరాన్ని బట్టి ప్రకటన పత్రాల సమర్పణ విధానాన్ని వి వరించడం జరుగుతుందని తెలి పారు.అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబి తాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పిం చిందని అన్నారు.వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గా నికి సంబంధించి ఓటరు నమో దు ప్రక్రియను వేగవంతం చేయా లని,ఓటరు నమోదు దరఖాస్తు లను ఎప్పటికప్పుడు పరిశీలిం చి,అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసు కోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో,ఎన్నికల విభా గం అధికారులు, సంబంధిత అధి కారులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొ న్నారు.

డిసెంబర్ చివరికల్లా రెడ్లకుంట ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలి -- మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, నవంబర్ 11(బ్యూరో చీఫ్ వైవి)



కోదాడ మండలం రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాలేరు వాగుపై రూ.47.64 కోట్లతో చేపట్టిన పథకం పనులు 70 శాతం పూర్తి కాలువ, భూగర్భ మోటార్లు, సబ్‌స్టేషన్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మిగిలిన పనులను వేగవంతం చేయాలని గుత్తేదారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం వానాకాలం, యాసంగి సీజన్లలో ఆరు గ్రామాల పరిధిలో 4,460 ఎకరాలకు సాగునీరు ఒక్కొటి 430 కిలోవాట్ల సామర్థ్యం గల నాలుగు వీటీ మోటార్లతో నీటి ఎత్తిపోత కాపుగల్లులో 1,608 ఎకరాలకు, నల్లబండగూడెంలో 1,400 ఎకరాలకు సాగునీరు రెడ్లకుంటలో 576 ఎకరాలకు, చిమిరాలలో 410 ఎకరాలకు సాగునీరు కూచిపూడిలో 400 ఎకరాలకు, ద్వారకుంటలో 66 ఎకరాలకు సాగునీరు రెడ్లకుంట ఎత్తిపోతల పథకంతో మొత్తం 1,486 కుటుంబాలకు లబ్ధి లబ్ధిదారుల్లో బీసీ 720, ఎస్సీ 446, ఓసీ 290, ఎస్టీ 30 కుటుంబాలు పరిశీలనలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, నీటిపారుదల శాఖ సీఈ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరైనారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీస్ కానిస్టేబుల్ సుంకరి మేఘన క్రీడల్లో రాణించారు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్



2024-25 బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ సుంకరి మేఘన (పిసి నెం. 31633), వివిధ క్రీడాంశాలలో తన అద్భుతమైన విజయాలు ప్రతిభతో హైదరాబాద్ నగర పోలీసులకు కీర్తిని తెచ్చిపెట్టారు.

-వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ ఎ స్పోర్ట్స్ మీట్‌లలో ఆమె ఈ క్రింది విజయాలను సాధించారు:

- బాస్కెట్‌బాల్‌లో మొదటి స్థానం
- హ్యాండ్‌బాల్‌లో మొదటి స్థానం (కెప్టెన్‌గా)
- వాలీబాల్‌లో రెండవ స్థానం (కెప్టెన్‌గా)

అంతేకాకుండా, 3వ మరియు 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్‌లో హైదరాబాద్ కమిషనరేట్ వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, వరుసగా లిమొదటి స్థానాలనులి సాధించారు. అంతేకాకుండా, ఆమె హర్యానాలో జరిగిన అఖిల భారత పోలీస్ క్లస్టర్ గేమ్స్‌లో తెలంగాణ పోలీసులకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి కూడా ప్రాతినిధ్యం వహించి, సీనియర్, జూనియర్ మరియు యూత్ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొన్నారు. ఆమె క్రీడా విజయాలలో రాష్ట్ర, జాతీయ, అంతర్-జిల్లా అంతర్-కళాశాల స్థాయిలలో సాధించిన అనేక పతకాలు ఉన్నాయి. ఆమె లిఉత్తమ దాడి క్రీడాకా రిణిలి లిఅప్పటి టోర్న మెంట్ క్రీడాకారిణిలి అవార్డులతో సహా వ్యక్తిగత గౌరవాలను కూడా అందు కున్నారు. మలక్‌పేట్ డివిజన్ ఏసీపీ, లిశ్రీ ఎల్. రాజా వెంకట్ రెడ్డిలి, డబ్ల్యూపీసీ సుంకరి మేఘన యొక్క అద్భు తమైన క్రీడా విజయాలు, అంకితభావం, క్రమశిక్షణ మరియు నిబద్ధతను ప్రశంసించారు. హైదరాబాద్ నగర పోలీసులకు కీర్తిని తెచ్చినందుకు ఆమెను అభినందిస్తూ, భవిష్యత్ క్రీడా పోటీలలో మరింత గొప్ప విజయాలు సాధించడానికి తన ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన ప్రోత్సహించారు. ఆమె అంకిత భావం, నాయకత్వ లక్షణాలు మరియు నిరం తర క్రీడా నైపుణ్యం హైదరాబాద్ నగర పోలీసులకు గర్వకారణం. ఆమె విజయాలు తోటి పోలీసు సిబ్బందికి, ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులకు స్ఫూర్తిగా నిలుస్తాయి. హైదరాబాద్ నగర పోలీసులు డబ్ల్యుపిసి సుంకరి మేఘ్నాకు అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్ క్రీడా ప్రయత్నాలలో నిరంతర విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. జారీ చేసినవారు: ఎస్.హెచ్.ఓ చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్.

కేపీహెచ్‌బీలో ప్రభుత్వ పాఠశాల స్థల పరిరక్షణకు ముందడుగు

-సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు శేరి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ

నవంబర్ 11



కూకట్‌పల్లి ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్‌లో హౌసింగ్ బోర్డు లేఔట్‌లో పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని అధికారికంగా ప్రభుత్వ పాఠశాల స్థలంగా గుర్తించేలా చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి శేరి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల అవసరాలకు వినియోగించేలా అధికారిక చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి స్పందించి ముఖ్యమంత్రి తో చర్చించి, సంబంధిత అధికారులను ఆదేశించడం ద్వారా ప్రభుత్వ పాఠశాల స్థలంగా గుర్తించే ప్రక్రియకు ముందడుగు పడిందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామని డబ్బులు వసూలు చేసి, పిల్లర్లు వేసి పనులను అసంపూర్తిగా వదిలేశారని సతీష్ రెడ్డి ఆరోపించారు. పదేళ్ల కాలంలో పాఠశాల నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అప్పటి కార్పొరేటర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణానికి ఏయే అనుమతులు తీసుకున్నారో, ఎంత మొత్తం వసూలు చేశారో, ఎంత ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో అధికారిక అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. “ప్రభుత్వ స్థలం ప్రజల ఆస్తి. దానిని ఎవరూ తమ సొంత జాగీరుగా భావించకూడదు. పాఠశాల నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలనుకునేవారు సంబంధిత ప్రభుత్వ శాఖను సంప్రదించి, అధికారికంగా సహకరించాలి. నిర్మాణ పనులు ప్రభుత్వ పర్యవేక్షణలో, పారదర్శక విధానంలో జరగాలి” అని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలకు పేరు పెట్టడం కంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పూర్తిస్థాయి భవనం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రజల ఆస్తుల పరిరక్షణకు, ప్రభుత్వ విద్య బలోపేతానికి స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీధర్ బాబు కి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. తెలిపిన వారిలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఉమ్మడి కెపిహెచ్బి డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కూకట్పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ మేకల మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

చిన్న నగరాల్లో కార్ల విక్రయాల జోరు



ఈ ఏడాది దేశీయ ప్యాసింజర్ వాహనాల (పీవీ) మార్కెట్ విస్తరణలో చిన్న నగరాలు, పట్టణాలే ప్రధాన పాత్ర పోషించాయి. ఈ అక్టోబరుతో ముగిసిన 10 నెలల్లో నమోదైన పీవీల అదనపు విక్రయాల్లో (ఇంక్రిమెంటల్ సేల్స్) సగానికి పైగా వాటా ఈ ప్రాంతాలదే. మార్కెట్ అనలిటిక్స్ సంస్థ జాటో డైనమిక్స్ రిపోర్టు ప్రకారం.. గడిచిన పది నెలల్లో మెట్రోయేతర పట్టణ ప్రాంతాల్లో కార్లు, ఇతర పీవీల అదనపు విక్రయాలు 3,89,401 యూనిట్లకు పెరిగాయి. అన్ని ప్రాంతాల్లో నమోదైన పీవీల అదనపు విక్రయాల్లో ఇది దాదాపు 55 శాతమని నివేదిక వెల్లడించింది. ఈ కాలానికి మెట్రో నగరాల్లో అదనంగా అమ్ముడైన 1,55,698 యూనిట్లు, గ్రామీణ మార్కెట్లో అదనపు విక్రయాలు 1,61,965 యూనిట్ల మొత్తం కంటే అధికమని రిపోర్టు తెలిపింది. నిర్దేశిత కాలానికి అంచనాకు మించి నమోదైన విక్రయాలనే ఇంక్రిమెంటల్ సేల్స్‌గా వ్యవహరిస్తారు. గడిచిన 10 నెలల్లో మెట్రోయేతర పట్టణ ప్రాంతాల్లో పీవీల రిజిస్ట్రేషన్లు వార్షిక ప్రాతిపదికన 17.5 శాతం వృద్ధితో 26.1 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి అమ్మకాలు 22.2 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. దేశవ్యాప్త పీవీల రిజిస్ట్రేషన్లలో ఈ ప్రాంతాల వాటాయే 57.3 శాతంగా ఉంది. వాహన కంపెనీలకు ఈ ప్రాంతాల ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుంది.సమీక్షా కాలానికి దేశవ్యాప్త పీవీల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 18.4 శాతం వృద్ధితో 45.6 లక్షల యూనిట్లకు పెరిగాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి అమ్మ కాలు 38.5 లక్షల యూనిట్లుగా ఉన్నాయి.

ఎన్విడియా అధినేతకు బిగ్ షాక్.. ఒక్కరోజే 7.4 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి.!



ఇంటర్నెట్ డెస్క్: ఎన్విడియా(అధినేత జెన్సన్ హువాంగ్‌కు బిగ్ షాక్ తగిలింది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఎనిమిదో స్థానం ఉన్న జెన్సన్ హువాంగ్‌కు వ్యక్తిగత వివాదం, కంపెనీ చుట్టూ నెలకొన్న పరిణామాలు ఒక్కసారిగా ఇబ్బందులు కలిగిస్తున్నాయి. చైనాకు సమాచారం చేరవేస్తున్నారనే అనుమానాలున్న ఓ వ్యాపారవేత్తతో ఆయనకు సంబంధాలున్నట్లు వార్తలు రావడం, ఆ తర్వాత తన భార్యకు నమ్మకద్రోహం చేసినట్లు అంగీకరించడం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలతో ఎన్విడియా షేర్లలో ఒత్తిడి నెలకొనడంతో ఆయన సంపద భారీగా పడిపోయింది.ఫోర్బ్స్ గణాంకాల ప్రకారం.. ఈ నెల 9న ట్రేడింగ్ ప్రారంభమైన తొలి అరగంటలోనే హువాంగ్ సంపద 7.4 బిలియన్ డాలర్లు(సుమారు రూ.6,600 కోట్లకు పైగా) తగ్గి 154.7 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో 8 నుంచి 10వ స్థానానికి పడిపోయారు. వారెన్ బఫెట్, లారీ ఎల్లిసన్ ఆయన్ను అధిగమించారు. అంతకుముందు ఈ నెల 6న కూడా టెక్నాలజీ షేర్ల పతనం కారణంగా ఆయన సంపద 15.1 బిలియన్ డాలర్లు పతనమైనట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ వెల్లడించింది. కాగా.. జెన్సన్ హువాంగ్‌కు ఎన్విడియాలో 3.5 శాతానికి పైగా వాటా ఉంది. ఆయన సంపదలో అత్యధిక భాగం కంపెనీ షేర్ల విలువపైనే ఆధారపడి ఉంది. అందుకే స్టాక్ మార్కెట్లో స్వల్ప మార్పులు వచ్చినా ఆయన ఆస్తుల విలువ బిలియన్ల డాలర్ల మేర మారిపోతోంది. షేర్లు కోలుకుంటే సంపద తిరిగి పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి కంపెనీపై జరుగుతున్న దర్యాప్తు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివా దం.. ఈ రెండూ హువాంగ్‌కు సవాళ్లుగా మారాయి. చైనాకు సమాచారం చేరవేసేందుకు యత్నించినట్లు అమెరికా నిఘా వర్గాలు అనుమానించిన ఓ వ్యాపారవేత్తతో హువాంగ్‌కు సంబంధాలు న్నాయ ంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై ఎన్విడియా స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. తన వ్యక్తిగత సంబంధం కారణంగా భార్య, పిల్లలు బాధపడినందుకు ఉద్యోగులకు పంపిన సందేశంలో హువాంగ్ విచారం వ్యక్తం చేశారు. దర్యాప్తునకు సహకరిస్తానని తెలిపారు.

“అచ్చం మా డిఫెండర్‌లాగే”.. చైనా ఆటోమొబైల్ కంపెనీ బీవైడీపై కోర్టుకెళ్లిన జాగ్వార్



చైనాకు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ బీవైడీకి, బ్రిటన్ ఆటోమొబైల్ దిగ్గజం జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్)కు మధ్య న్యాయపోరు మొదలైంది. బీవైడీ రూపొందించిన టీ7 ఎస్‌యూవీలో తమ ల్యాండ్ రోవర్ డిఫెండర్ సాంకేతికతను అక్రమంగా ఉపయోగించారని జేఎల్ఆర్ ఆరోపించింది. డిఫెండర్ వాహనాన్ని విడదీసి, దాని సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి టీ7లో వినియోగించారని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం ప్రస్తుతం నెదర్లాండ్స్‌లోని హేగ్ కోర్టు పరిధిలో ఉంది.ఈ ఏడాది ఆగస్టులో కోర్టు ఆదేశాలతో అధికారులు నెదర్లాండ్స్‌లోని షీడామ్, హూఫ్‌డార్ప్ ప్రాంతాల్లో ఉన్న బీవైడీ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. అక్కడి డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కీలక ఆధారాలు తొలగించకుండా ఉండేందుకే ఈ చర్యలు చేపట్టాలని కోరినట్లు జేఎల్ఆర్ తెలిపింది. ఈ కేసులో ప్రాథమిక విచారణపై నవంబర్ 11న కోర్టు నిర్ణయం వెలువరించాల్సి ఉంది.కోర్టు చర్యను బీవైడీ న్యాయవాదులు ‘ఫిషింగ్ ఎక్స్‌పెడిషన్’గా అభివర్ణించారు. అవసరానికి మించి పెద్ద సంఖ్యలో ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారని వాదించారు. అయితే విచారణ ప్రక్రియకు బీవైడీ అడ్డంకులు సృష్టిస్తోందని జేఎల్ఆర్ తరఫు న్యాయవాదులు ఆరోపించారు. ఈ కేసు విచారణలో ఉండటంతో రెండు సంస్థలూ బహిరంగంగా స్పందించలేదు.బీవైడీకి చెందిన ఫాంగ్ చెంగ్ బావో బ్రాండ్ కింద ఈ ఎస్‌యూవీని 2025 సెప్టెంబరులో చైనా మార్కెట్లో బావో 7 పేరుతో విడుదల చేశారు. ఆ తర్వాత తాయ్ 7గా పేరు మార్చారు. బాక్సీ ఆకారం, నిటారుగా ఉండే ముందు భాగం, చతురస్రాకార వీల్ ఆర్చ్‌లు, వెనుక భాగంలో ప్రత్యేక స్టోరేజ్ వంటి డిజైన్ అంశాలు ల్యాండ్ రోవర్ డిఫెండర్‌ను పోలి ఉన్నాయనే చర్చ మొదటి నుంచీ ఉంది. అయితే జేఎల్ఆర్ అభ్యంతరం కేవలం డిజైన్‌కు పరిమితం కాలేదు. తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుమతి లేకుండా ఉపయోగించారన్నదే ప్రధాన ఆరోపణ.వచ్చే జనవరిలో బ్రిటన్ మార్కెట్లోకి టీ7 అడుగుపెట్టనుంది. ఏడు సీట్ల డిఫెండర్ 110తో పోలిస్తే తక్కువ ధరకు దీన్ని విక్రయించాలనేది బీవైడీ ప్రణాళిక. ఈ నేపథ్యంలో జేఎల్ఆర్ దాఖలు చేసిన కేసు ఆ సంస్థ అంతర్జాతీయ విస్తరణకు కీలక పరీక్షగా మారింది. గతంలోనూ చైనా సంస్థ జియాంగ్లింగ్ మోటార్ కార్పొరేషన్‌పై రేంజ్ రోవర్ ఎవోక్ డిజైన్ కాపీ ఆరోపణలతో జేఎల్ఆర్ న్యాయపోరాటం చేసింది. 2019లో ఆ కేసులో విజయం సాధించింది. తాజా కేసులో కోర్టు నిర్ణయం ఎలా ఉండబోతోందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి: పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది.ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది.దమరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు



పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

స్పోర్ట్స్

అఫీషియల్: అర్ష్‌దీప్, హార్దిక్ ట్రేడ్ పూర్తి.. పారితోషికం ఎంతంటే..!



గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ.. ఐపీఎల్ 2027కు ముందే ఫ్రాంచైజీల మధ్య భారీ ట్రేడ్ చోటుచేసుకుంది. ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆ జట్టును వీడి పంజాబ్ కింగ్స్‌లో చేరనున్నాడు. మరోవైపు పంజాబ్ జట్టుకు కీలక బౌలర్‌గా ఉన్న అర్ష్‌దీప్ సింగ్ ముంబయి ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ రెండు జట్ల మధ్య ఆటగాళ్ల మార్పిడి పూర్తయింది. దీనిపై గతకొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఐపీఎల్ దీన్ని అధికారికంగా ప్రకటించింది.హార్దిక్ పాండ్యాకు ముంబయి ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో తొలిసారి ఆ జట్టులో చేరిన అతడు.. 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిల్ సాధించిన జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఏడు సీజన్ల పాటు ముంబయి తరఫున ఆడిన తర్వాత 2022లో గుజరాత్ టైటాన్స్‌కు మారాడు. తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించాడు. 2023లోనూ గుజరాత్ ఫైనల్‌కు చేరింది. 2024లో తిరిగి ముంబయికి వచ్చిన హార్దిక్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. హార్దిక్ ఇప్పటివరకు 162 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. 2,955 పరుగులు చేయడంతో పాటు 82 వికెట్లు పడగొట్టాడు. 146.28 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ముంబయిలో రూ.16.35 కోట్ల పారితోషికం అందుకున్న అతడు.. ఇప్పుడు రూ.18 కోట్లకు పంజాబ్ కింగ్స్‌లో చేరనున్నాడు. 2019లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్ సింగ్.. ఎనిమిది సీజన్ల పాటు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు పడగొట్టాడు.

హార్దిక్ రాక.. టైటిల్ వేటలో మా కీలక ముందడుగు: పంజాబ్ కింగ్స్ సీఈవో

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ కింగ్స్ జట్టు, ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య జట్టులోకి రావడం తమ టైటిల్ వేటలో చాలా ముఖ్యమైన పరిణామమని పంజాబ్ కింగ్స్ సీఈవో సతీశ్ మేనన్ అభివర్ణించారు. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన భారీ ప్లేయర్ ట్రేడ్‌లో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా హార్దిక్ పాండ్య రూ. 18 కోట్ల ఫీజుతో పంజాబ్ కింగ్స్‌కు బదిలీ కాగా, పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతే మొత్తానికి ముంబై ఇండియన్స్‌కు వెళ్లాడు. ముంబై ఇండియన్స్‌లో రూ. 16.35 కోట్లుగా ఉన్న హార్దిక్ వేతనం, ఈ కొత్త ఒప్పందంతో పెరిగింది. 2024 నుంచి ముంబై జట్టుకు కెప్టెన్‌గా ఉన్న హార్దిక్, ఈ ట్రేడ్‌తో ఆ జట్టుతో తన ప్రయాణాన్ని ముగించాడు. ఇప్పటికే ఐదు ఐపీఎల్ టైటిళ్లు (ముంబైతో 4, గుజరాత్‌తో 1) గెలిచిన హార్దిక్, పంజాబ్ కింగ్స్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడనున్నాడు. జట్టులో



చేరిన అనంతరం సోషల్ మీడియాలో స్పందించిన హార్దిక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, కోచ్ రికీ పాంటింగ్‌కు తాను అండగా ఉంటానని పేర్కొన్నాడు. మరోవైపు 8 సీజన్ల పాటు పంజాబ్‌కు ఆడి, 96 మ్యాచ్ లలో 111 వికెట్లతో ఆ జట్టు తరఫున ఆల్-టైమ్ లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్న అర్ష్‌దీప్ సింగ్, ఇకపై ముంబై ఇండియన్స్ తరఫున ఆడనున్నాడు.

ప్రియుడ్ని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్ ప్రియా భవానీ శంకర్



ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె పెళ్లాడారు.(నవంబర్ 11న) ఉదయం చెన్నైలో వీరి వివాహం అత్యంత నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. సినిమా పరిశ్రమలో సాధారణంగా కనిపించే ఆర్భాటాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వేడుకలకు దూరంగా ఉంటూ, అత్యంత సాదాసీదాగా ఈ శుభకార్యాన్ని నిర్వహించారు. ఈ పెళ్లి వేడుకలో ప్రియా భవానీ శంకర్ సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో మెరిసి పోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఎలాంటి హంగులు లేకుండా ఇంత సింపుల్‌గా వివాహం చేసుకోవడంపై నెటిజన్లు, అభిమానులు నూతన దంపతులను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. అప్పటి నుంచే వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు 10 ఏళ్లుగా వీరి బంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని ప్రియ ఎప్పుడూ దాచలేదు. గతం లో పలు ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ ప్రేమను ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఒక ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఇప్పుడు అధికారికంగా ఒక్కట య్యారు. న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్, ఆ తర్వాత బుల్లితెర సీరియళ్ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2017లో 'మేయాద మాన్' చిత్రంతో తమిళ వెండితెరకు పరిచయమై, పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. తెలుగులో 'కల్యాణం కమనీయం', 'భీమా', 'జీబ్రా' చిత్రాల్లో నటించిన ఆమె, కమల్ హాసన్ 'భారతీయుడు 2'తో పాటు నాగచైతన్య 'దూత' వెబ్ సిరీస్‌లోనూ మెప్పించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించి, తెలుగు ప్రేక్షకుల నుంచి ఆమెకు విశేష ఆదరణ దక్కింది.

కమల్ హాసన్ పై పోలీసులకు ఫిర్యాదు

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) అధినేత, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై తమిళనాడులో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇటీవల ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రకటించిన కొత్త సినిమా టైటిల్ 'సండియార్' తీవ్ర వివాదానికి దారితీయడమే ఇందుకు కారణం. ఈ పేరు ఉద్దేశపూర్వకంగా ప్రాంతీయ, కుల ఘర్షణలను రెచ్చగొట్టేలా ఉందంటూ పుదియ తమిళగం (పీటీ) పార్టీ నేతలు పోలీసులను ఆశ్రయించారు. నవంబర్ 7న కమల్ హాసన్ 72వ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో, రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే 'సండియార్' అనే పదం ఒక నిర్దిష్ట ఆధిపత్య ధోరణిని, హింసను ప్రోత్సహించేలా ఉందని పుదియ తమిళగం పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఈ పేరు ఉందని పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కె. కృష్ణస్వామి ఆరోపించారు. గతంలో 2003లోనూ కమల్ హాసన్ తన చిత్రానికి 'సండియార్' అనే పేరును ఖరారు చేశారు. అప్పట్లో పీటీ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, ఆ పేరును 'విరుమాండి'గా మార్చి 2004లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడు దాదాపు 23 ఏళ్ల తర్వాత మళ్లీ అదే పేరును తీసుకురావడం కక్షసాధింపు చర్యేనని కృష్ణస్వామి మండిపడ్డారు. ఎంపీగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కమల్ హాసన్ ఇలా ప్రవర్తించడం తగదని ఆయన పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు గానీ, అటు చిత్ర బృందం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.



సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా ప్రారంభం.. నిర్మాతగా సుకుమార్!

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. చూఅనుష్కబ10 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్ర మాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఓ పాటను చిత్రీకరిం చనున్నారు.మోహన్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మిస్తున్నాడు. ఆయనతో పాటు ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, అన్మోల్ శర్మ, అశోక్ బండిరెడ్డి సంయుక్తంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ సరసన నయన్ సారిక కథానాయికగా నటించనుంది. మూడు జాతీయ అవార్డులు అందుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ బాణీలు సమకూర్చనున్నాడు. సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దేవుడి ఆశీస్సు లతో, ఎంతో ఉత్సాహంగా #Siddhu10 ప్రయాణం మొదలైందని పేర్కొన్నాడు. త్వరలోనే ఓ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపాడు.మరోవైపు దర్శకుడు మోహన్ కూడా సినిమా ప్రారంభానికి ముందు భావోద్వేగభరితమైన పోస్టు పెట్టాడు. ఓ కథకుడి కల వెండితెరపై సాకారమయ్యే దిశగా తొలి అడుగు పడిందని, ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరించే అందమైన కలయికగా ఈ సినిమా నిలుస్తుందని పేర్కొన్నాడు. చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



అనిరుధ్-కావ్య పెళ్లిలో రజనీకాంత్ స్టెప్పులు.. గ్రీస్‌లో తలైవా సందడి



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. వీరిద్దరి వివాహ వేడుక గ్రీస్ దేశంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఎంతో వైభవంగా జరిగింది. డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నిర్వహించిన ఈ శుభకార్యానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వివాహ వేడుకలో సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనిరుధ్‌కు బంధువైన రజనీకాంత్, కొత్త దంపతులను ఆశీర్వదించడమే కాకుండా వారితో కలిసి ఉత్సాహంగా సందడి చేశారు. తన బ్లాక్‌బస్టర్ హిట్ పాట 'మనసిలాయో'కు అనిరుధ్, కావ్య మారన్‌లతో కలిసి రజనీకాంత్ వేసిన మాస్ స్టెప్పులు వేడుకలో సరికొత్త జోష్ నింపాయి. 75 ఏళ్ల వయసులో కూడా ఆయన తనదైన మార్కు స్టైల్‌తో డ్యాన్స్ చేసి అతిథులను ఆశ్చర్యపరిచారు. ఈ డ్యాన్స్ వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను, నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వేడుకకు తమిళనాడు మాజీ ముఖ్య మంత్రి ఎం.కె. స్టాలిన్, కళానిధి మారన్ కుటుంబంతో పాటు ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. విదేశంలో జరిగిన ఈ వివాహం అనంతరం, సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖుల కోసం చెన్నైలో భారీగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ 21న ఈ విందు కార్యక్రమం అత్యంత ఘనంగా జరగనుంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com